# The first Arab-India Energy Forum (June 8-9, 2021)

June 09, 2021

---

# తొలి అరబ్-భారత్ ఇంధన ఫోరం (జూన్ 8-9, 2021)

జూన్ 09, 2021

1. భారత్, కింగ్‌డమ్ ఆఫ్ మొరాకో సహ అధ్యక్షతన 2021 జూన్ 8-9 తేదీల్లో తొలి అరబ్-భారత్ ఇంధన ఫోరం (ఏఐఈఎఫ్) సదస్సు వర్చువల్‌గా జరిగింది. అరబ్-భారత్ కోఆపరేషన్ ఫోరం (ఏఐసీఎఫ్)లో భాగమైన ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ అమల్లో భాగంగా మరియు భారత సీనియర్ అధికారులు, లీగ్ ఆఫ్ అరబ్ స్టేట్స్ (ఎల్ఏఎస్) మధ్య 2021 జనవరి 12న వర్చువల్‌గా జరిగిన మూడో సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సమావేశం జరిగింది.

2. ఫోరం ప్రారంభ సెషన్‌లో భారత విద్యుత్, నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ (స్వతంత్ర హోదా) సహాయ మంత్రి గౌరవనీయ శ్రీ ఆర్‌కే సింగ్, మొరాకో ఇంధన, గనులు మరియు పర్యావరణ శాఖ మంత్రి గౌరవనీయ శ్రీ అజీజ్ రబ్బా, ఎల్ఏఎస్ ఆర్థిక వ్యవహారాల అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ గౌరవనీయ డా. కమల్ హసన్ అలీ ప్రసంగించారు. తదుపరి జరిగిన ప్లీనరీ సమావేశాల్లో ఇంధన పరివర్తన, అంతర్-ప్రాంతీయ విద్యుత్ ట్రేడింగ్, హైడ్రోకార్బన్స్, అణు విద్యుదుత్పత్తి రంగాల్లో పరస్పర సహకారం మరియు సవాళ్లపై చర్చించారు. భారత్, ఎల్ఏఎస్ సభ్యదేశాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు ఆర్గనైజేషన్ ఆఫ్ అరబ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ (ఓఏపీఈసీ), అరబ్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఏఏఈఏ) వంటి కీలకమైన ప్రాంతీయ సంస్థలకు చెందిన నిపుణులు వీటిలో పాల్గొన్నారు.

3. వివిధ ఆర్థిక రంగాలకు ఊతమిచ్చేటువంటి ఇంధన ఆదా కార్యక్రమాలు, నూతన మరియు పునరుత్పాదక ఇంధనాలను వేగవంతంగా అభివృద్ధి చేయడం, ప్రాంతీయంగా విద్యుత్ భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం, చమురు రికవరీని పెంచుకోవడం, గ్యాస్ వెలికితీతను పటిష్టం చేసుకోవడం, సురక్షితమైన అణు విద్యుత్ ఉత్పత్తి చేయడం తదితర అంశాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, అత్యుత్తమ విధానాలను పరస్పరం పంచుకునేందుకు ఫోరం వేదికయ్యింది. ఆయా దేశాల్లో ఈ రంగాలను పర్యవేక్షించే జాతీయ నియంత్రణ విధానాలు, పెట్టుబడి అవకాశాలతో పాటు పరిశోధన మరియు అభివృద్ధి కార్యకలాపాలు, శిక్షణలో పరస్పరం సహకరించుకునే అవకాశాలపై కూడా చర్చించారు.

4. భారత్, ఎల్ఏఎస్‌లో భాగమైన పలు దేశాలు పరిశుభ్రమైన, పర్యావరణ అనుకూలమైన ఆర్థిక వ్యవస్థలుగా రూపాంతరం చెందేందుకు కృషి చేస్తున్నప్పటికీ, సమీప భవిష్యత్తులో అవి హైడ్రోకార్బన్లపై ఆధారపడక తప్పదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

5. ఫోరంనకు తోడ్పాటు అందించడంతో పాటు సమావేశానికి సహ అధ్యక్షత వహించినందుకు గాను ఇరువురు మంత్రులకు సదస్సులో పాల్గొన్న వారు మనస్ఫూర్తిగా ప్రశంసలు తెలియజేశారు. కీలకమైన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంలో చక్కని సమన్వయంతో పనిచేసిన ఎల్ఏఎస్ జనరల్ సెక్రటేరియట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

6. 2023లో భారత్‌లో ఏఐఈఎఫ్ రెండో ఎడిషన్‌ను నిర్వహించేందుకు అందరూ అంగీకారం తెలిపారు.

**న్యూఢిల్లీ**
**జూన్ 09, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.